క్లుప్తంగా

డ్రెయినేజీల పరిశీలన



బాన్సువాడ: పట్టణంలోని 1వ వార్డులో ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్ పర్యటించి డ్రెయినేజీలను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజలకు అవగాహన కల్పించారు. డ్రెయినేజీల్లో చెత్తా చెదారం వేయవద్దని, డ్రెయినేజీల్లో చెత్త పేరుకుని పోవడం వల్ల నీరు నిల్వ ఉండి దోమల బెడద ఎక్కువవుతుందన్నారు. పరిసరాలను మనమే శుభ్రంగా ఉంచుకోవాలని, సీజనల్ వ్యాధులు ప్రభలే సమయం కనుక అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కాంగ్రెస్ నాయకులు అంజిరెడ్డి, నార్ల సురేష్, ఖాలేఖ్, ఏజాస్, పిట్ల శ్రీధర్, అమర్, తదితరులున్నారు.

లింగంపేటలో..



లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో పారిశుధ్య పనులను మంగళవారం ఎంపీడీవో నరేష్ పరిశీలించారు. ఈ నెల 21న జిల్లా కలెక్టర్ లింగంపేట మండల కేంద్రంలో బస్టాండు నుంచి గ్రామంలోని పాత రాఘవ మెడికల్ వరకు రోడ్డుకు ఇరువైపులా చెత్తా చెదారం, పిచ్చి మొక్కలు, మురికి కాల్వల్లో పూడిక పేరుకుపోవడంతో గ్రామ పంచాయితీ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో రెండు రోజులుగా గ్రామంలో పారిశుధ్య పనులు వేగవంతం చేశారు. ఎంపీవో మలహరి, కార్యదర్శి శ్రవణ్ కుమార్, బట్టు సాయిలు, సిబ్బంది ఉన్నారు.

వివాదాస్పద భూమి..



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని పెట్రోల్ బంక్ సమీపంలో గల వివాదాస్పద భూమిని మంగళవారం అధికారులు పరిశీలించారు. ఇప్పకాయల ప్రభాకర్ తనకు చెందిన భూమి విషయంలో లోకాయుక్తలో ఫిర్యాదు చేశాడు. దీంతో విచారణ అధికారి విద్యాసాగర్ ఆధ్వర్యంలో భూమిని పరిశీలించారు. బాధితులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని పేర్కొన్నారు. ఆర్డీవో వీణ, తహసీల్దార్ సత్యనారాయణ, డిప్యూటీ తహసీల్దార్ తిరుపతి, సీఐ సంతోష్ కుమార్, సర్వేయర్, రైతులు పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



నస్రుల్లాబాద్: వర్షాకాలం సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో సూర్యకాంత్ అన్నారు. మండలంలోని రాముల గుట్ట తాండాలో మంగళవారం డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా నిలువ నీరు ఉండకుండా చూడాలని ఇంటింటికి తిరుగుతు అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పరిశీలించారు.

నోయిడా సైన్స్ శిక్షణలో భిక్కనూరు టీచర్



భిక్కనూరు: మినిస్ట్రి ఆఫ్ కన్స్యూమర్ అఫైర్స్, బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్ ఆధ్వర్యంలో నోయిడాలో జరుగుతున్న లెర్నింగ్ సైన్స్ శిక్షణ కార్యక్రమంలో భిక్కనూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు తమ్మలి రాజు మంగళవారం పాల్గొన్నారు. విద్యార్థుల్లో పాఠశాల స్థాయి నుంచి వస్తువులు నాణ్యతపై అవగాహన కల్పించే విధంగా ప్రభుత్వం పాఠాలను రూపొందించాలని రాజు సూచించారు.

ఉపాధ్యాయుడిపై దాడి సరికాదు



కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ హనుమాన్ మందిర్ పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయుడు బాలకృష్ణపై విద్యార్థి సంఘ నాయకుడు సాయికృష్ణ చేసిన దాడి సరి కాదని, తీవ్రంగా ఖండిస్తున్నామని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సంగయ్య తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలో నాయకులు మాట్లాడారు. ఉపాధ్యాయుడిపై దాడి చేయడం అత్యంత హేయమైన చర్యని అన్నారు. పోలీసులు తక్షణమే దాడి చేసిన వ్యక్తిని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని లేనిపక్షంతో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. సంఘం మండల అధ్యక్షుడు రాజు, ప్రధాన కార్యదర్శి వంశీ తదితరులున్నారు.

చినుకు పడితే చీకటే

- ఉమ్మడి బీర్కూర్ మండలంలో చిన్నపాటి గాలి వానకే గంటలపాటు కరెంటు కోతలు
- అందుబాటులో ఉండని అధికారులు

నస్రుల్లాబాద్(బాన్సువాడ): వర్షాకాలం ప్రారంభమై 20 రోజులు పూర్తికాక ముందే చిరుగాలులకు, చిన్నపాటి వర్షాలకు గంట కొద్దీ కరెంటు కోతలు మొదలయ్యాయి. చినుకులు పడినా కూడా నస్రుల్లాబాద్ మండల సబ్‌స్టేషన్ పరిధిలో గల నస్రుల్లాబాద్, మైలారం, బొప్పాస్‌పల్లి, లింగంపల్లి, నెమ్లి, కామిశెట్టిపల్లి గ్రామాల పరిధిలో కరెంటు కట్ అవుతోంది. బీర్కూర్ మండలం పరిధిలో గల దామరంచ, బీర్కూర్, తిమ్మాపూర్ సబ్‌స్టేషన్లు ఉన్నాయి. ఏదో ఒక రోజు జరిగితే వర్షాకాలం తప్పదులే పెద్ద వర్షం వల్ల అని సర్దుకుపోతారు కాని ప్రతి రోజు చిన్నపాటి వర్షానికే పవర్ కట్ అవుతుండటంతో ఇబ్బందులకు గురవుతున్నారు. దీనికి తోడు వరి నాట్లు మొదలవ్వడంతో ఉదయం నీరు పెడదామనుకున్న రైతులకు కరెంటు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

పరిస్థితి చక్కదిద్దే నాథుడే కరువు

నస్రుల్లాబాద్ సబ్‌స్టేషన్ పరిధిలో గల గ్రామాల్లో కొన్ని రోజులుగా మైలారం ఫీడర్ పరిధిలో రాముల గుట్ట తండా, లింగంపల్లి, బొప్పాస్‌పల్లి, మైలారం, ఫకీరా నాయక్ తండా, తార్య నాయక్ తండా గ్రామాలున్నాయి. గ్రామాలతో పాటు ఏజీఎల్ సైతం ఒకే లైన్ ఉంటుంది. ఈ గ్రామాల పరిధిలో గల పంట పొలాలకు సైతం ఇదే లైన్ ఉండటంతో ప్రజలు కరెంటు కోతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆదివారం ఇంటి వద్ద సరదాగా ఉందామనుకుంటే ఒక్కరోజే సుమారు 10 నుంచి 15 సార్లు గంటల కొద్దీ కరెంటు నిత్యం పోతుందని ప్రజలు వాపోతున్నారు. ఈ విషయంపై అధికారులకు తెలిపినా కూడా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.

స్థానికంగా ఉండని అధికారులు..

అత్యవసర సేవలలో ఉన్న విద్యుత్ శాఖా సిబ్బంది అధికారులు హెడ్ క్వార్టర్‌లో ఉంటూ విధులకు హాజరవ్వాల్సి ఉంటుంది. కాని కింద స్థాయి సిబ్బందిని అందుబాటులో ఉంచి లైన్‌మెన్, ఏఈలు మాత్రం బాన్సువాడ, బీర్కూర్, బోధన్, నిజామాబాద్‌లలో ఉంటున్నారు. వర్షాలు, గాలుల వల్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడితే తాపీగా గంటల సమయం లేటుగా వచ్చి కింది స్థాయి ఉద్యోగులపై ఆగ్రహం వ్యకం చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా దూర ప్రాంతాల్లో ఉంటూ విధులు నిర్వహిస్తున్నా కూడా ఉన్నతాధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు.



విరిగిపడిన స్తంభాలు(ఫైల్)

దోమలు, ఉక్కపోతతో ఇబ్బందులు

చిన్నపాటి గాలి వానకు గంటల సమయం కరెంటు పోతుంది. వర్షాకాలానికి ముందే జాగ్రత్తలు తీసుకోక పోవడంతో కరెంటు కష్టాలు కనపడుతున్నాయి. రాత్రిళ్లు కరెంటు లేక దోమలతో, ఉక్కపోతతో ఇబ్బంది పడుతున్నాం. ఉన్నతాధికారులు స్పందించి సమస్యను తీర్చాలి.

– రణధీర్ రెడ్డి, మైలారం

అధికారులు స్పందించాలి

కాంగ్రెస్ పాలన రాగానే కరెంటు కష్టాలు మొదలయ్యాయి. నాటు వేసే సమయంలో నీరు పారించాల్సిన సమయంలో కూలీలు వెనుదిరగాల్సిన పరిస్థితి ఉంటోంది. స్థానిక నాయకులు, అధికారులు స్పందించి విద్యుత్ కోతలు లేకుండా చూడాలి.

– రాము, రైతు, హాజీపూర్

సంఘాలు మరింత బలోపేతం కావాలి



తాడ్వాయిలో మాట్లాడుతున్న విజయలక్ష్మి



బీబీపేటలో.. ఎంపీడీవో పూర్ణచంద్రోదయ కుమార్

- అదనపు డీఆర్‌డీవో విజయలక్ష్మి

తాడ్వాయి(ఎల్లారెడ్డి): గ్రామాలలో గల మహిళ సంఘాలు ఆర్థికంగా మరింత బలోపేతం కావాలని అదనపు డీఆర్‌డీవో విజయ లక్ష్మి అన్నారు. తాడ్వాయి ఐకేపీ కార్యాలయంలో మంగళవారం మండల సమాఖ్య అధ్యక్షులు యశోదబాయి అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. అర్హులైన సంఘాలకు రుణాలు ఇప్పించి, ఆ సంఘాలు మరింత బలోపేతమయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. స్త్రీనిధి, బ్యాంకులలో తీసుకున్న రుణాలు 100 శాతం చెల్లించాలన్నారు. గ్రామ సంఘం, చిన్న సంఘాలు ఎల్లప్పుడూ ఏ–గ్రేడ్‌లో ఉండేలా చూడాలన్నారు. డీపీఎం రమేష్ బాబు, ఎంపీడీవో సయ్యద్ సాజీద్‌అలీ, ఏపీఎం మనోహర్, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

బీబీపేట: సమాజంలో మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఎంపీడీవో పూర్ణచంద్రోదయ కుమార్ ఆకాంక్షించారు. మంగళవారం మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య భవనంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మండలంలోని మహిళా గ్రూపులు స్త్రీనిధి, బ్యాంకు లోన్ల రికవరీలో జిల్లాలోనే ముందంజలో ఉండాలని సూచించారు. అలాగే ఉపాధి హామీ పథకంలో మహిళలకు లబ్ధి చేకూరే స్కీంల గురించి వివరించారు. సమావేశంలో ఏపీఎం బాలపోచయ్య, సీసీలు బాల్‌చంద్రం, రాజేశ్వర్‌రెడ్డి, శ్రీను, నవీన్, రాజేందర్, మహిళలు పాల్గొన్నారు.

కేజీబీవీల్లో అడ్మిషన్లు ఫుల్

- జిల్లాలో మొత్తం 19 పాఠశాలలు
- సీటు దొరక్క వెనుదిరుగుతున్న పిల్లల తల్లిదండ్రులు

రాజంపేట: గ్రామీణ ప్రాంతాల్లో బాలికలకు నాణ్యమైన విద్యను అందించాలనే ఉద్దేశంతో కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాలు(కేజీబీవీ) ఏర్పాటు చేశారు. జిల్లాలో 19 కేజీబీవీలు ఉండగా వీటిలో రాజంపేట కేజీబీవీతో పాటు ఇతర కేజీబీవీల్లో ఇంగ్లిష్ మీడియంలో బోధిస్తుండటంతో సీట్ల కోసం డిమాండ్ ఎక్కువగా ఉంది. ఇటీవల పదో తరగతి ఫలితాలలో రాజంపేట కేజీబీవీలో ముగ్గురు విద్యార్థినిలు 552, 549, 545 మార్కులు సాధించగా వీరిలో ఒకరు మండల టాపర్‌గా నిలిచారు. రాజంపేట కేజీబీవీలో నాణ్యమైన విద్య, మెరుగైన మౌలిక వసతులు ఉండటంతో మండలంలోని విద్యార్థినుల తల్లిదండ్రులు తమ పిల్లలను ఈ పాఠశాలలో చేర్పేందుకు ఉత్సాహం చూపుతున్నారు. వేసవి సెలవుల నుంచే పాఠశాలలో చేర్పించేందుకు పాఠశాల చుట్టూ తిరుగుతున్నారు. రాజంపేట కేజీబీవీతో పాటు ఇతర కస్తూర్బా పాఠశాలలో ఇప్పటికే అడ్మిషన్లు పూర్తయ్యాయని ఉపాధ్యాయులు చెబుతున్నారు. రాజంపేటలో ఆరు నుంచి పదో తరగతి వరకు 200 మందికి అడ్మిషన్లకు అనుమతి ఉండగా ఇప్పటికే 232 మందికి పైగా చేరారు. రోజూ పదుల సంఖ్యలో విద్యార్థుల తల్లిదండ్రులు అడ్మిషన్ కోసం వచ్చి సీటు దొరక్క వెనుదిరుగుతున్నారు.

అడ్మిషన్లు క్లోజ్ చేశాం



రాజంపేట కేజీబీవీలో ఇప్పటికే అన్ని తరగతుల్లో అడ్మిషన్లు నిండిపోయాయి. పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యం 200 ఉంటే ఇప్పటికే 232 విద్యార్థుల అడ్మిషన్లు తీసుకున్నాం. ప్రస్తుతం 6వ తరగతికి గాను 50 మంది నూతన విద్యార్థినులకు అడ్మిషన్లు తీసుకున్నాం. పిల్లల తల్లిదండ్రులు అడ్మిషన్ల విషయంలో ఒత్తిడి చేయవద్దని కోరుతున్నాం.

– శ్రీవాణి, పాఠశాల స్పెషల్ ఆఫీసర్

మున్సిపల్‌లో లావాదేవీలు ప్రారంభిస్తాం

- బిచ్కుంద మున్సిపల్ కమిషనర్ ఖయ్యూం

బిచ్కుంద(జుక్కల్): బిచ్కుంద మున్సిపల్ కార్యాలయంలో త్వరలోనే లావాదేవీలు ప్రారంభమవుతాయని, బ్యాంక్ అకౌంట్ ఓపెన్ చేస్తున్నామని మున్సిపల్ కమిషనర్ ఖయ్యూం తెలిపారు. మంగళవారం సాక్షి దినపత్రికలో భారంగా మారిన మున్సిపల్ నిర్వహణ..అనే శీర్షికతో వచ్చిన కథనానికి అధికారులు స్పందిచారు. మున్సిపాలిటీకి ఆరుగురు సిబ్బందిని కేటాయించారని కమిషనర్ తెలిపారు. ఇద్దరు జూనియర్ అసిస్టెంట్లు శ్రీనివాస్, వీరారెడ్డి, జూనియర్ అకౌంటెంట్ విశాల్, అసిస్టెంట్ గంగారాం, శివాణి విధుల్లో చేరి బాధ్యతలు స్వీకరించారు.. మరి కొంత మంది స్టాఫ్ వస్తున్నారని, కొత్తగా పారిశుధ్య కార్మికులకు తీసుకుంటామని వివరించారు. ఆయా వార్డులలో కాలిపోయిన మోటార్లకు మరమ్మతులు చేసి తాగునీరు అందిస్తున్నామని తెలిపారు. అకౌంట్‌కు సబంధించిన పాన్ కార్డు, జీఎస్టీ, టిన్ నెంబర్ కోసం దరఖాస్తు పెట్టుకున్నాం.. వారం వ్యవధిలో వస్తుందన్నారు. ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు మున్సిపాలిటీ అభివృద్ధి కోసం రూ.15 కోట్లు మంజూరు చేయించారు.. కార్యాలయం అకౌంట్‌లో జమ కానున్నాయని మరో రూ.20 కోట్ల నిధుల కోసం ఎమ్మెల్యే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు.



విధుల్లో చేరిన కొత్త స్టాఫ్

పౌష్టికాహారాన్ని అందించాలి

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చే చిన్నారులకు సరైన పౌష్టికాహారాన్ని అందించాలని నాగిరెడ్డిపేట ఎంపీడీవో ప్రభాకరచారి సూచించారు. మాటూర్‌లో అంగన్‌వాడీ కేంద్రంతోపాటు ప్రాథమిక పాఠశాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రంలోని పలురికార్డులను ఆయన పరిశీలించి సూచనలు ఇచ్చారు. పంచాయతీ కార్యదర్శి రవీందర్ ఉన్నారు.

రైతులను ఆదుకోవాలి

రామారెడ్డి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను ఆదుకోవాలని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా ఉపాధ్యక్షుడు సాయిరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం రామారెడ్డిలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రైతులకు తలెత్తున్న కరెంటు సమస్యలు, అర్హత ఉన్న అందరు రుణమాఫీ కాకపోవడం, సన్న వడ్లకు బోనస్ గురించి చర్చించినట్లుగా తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి శంకర్రావు, జిల్లా కమిటీ సభ్యులు రాజశేఖర్, లింగం, మండల అధ్యక్షులు నారెడ్డి రాజిరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి తిరుపతి పాల్గొన్నారు.

పెండింగ్ చలానాల వసూలు

పెద్దకొడప్‌గల్(జుక్కల్): జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని 161 జాతీయ రహదారిపై అంజనీ చౌరస్తా వద్ద ఎస్సై మహేందర్ ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి వాహనదారుల వద్ద లక్ష రూపాయిల పెండింగ్ చలాన్లను వారితో కట్టించినట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. అలాగే ద్విచక్ర వాహనదారులు తప్పక హెల్మెట్ ధరించాలని, ప్రతి వాహనదారులు తమ వద్ద వాహన ధ్రువపత్రాలను ఉంచుకోవాలని ఆయన సూచించారు. ట్రాఫిక్ నిబంధనలను ఎవరైనా అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

డ్వాక్రా సంఘం మహిళలకు శిక్షణ

రామారెడ్డి: రామారెడ్డి రైతు వేదికలో మంగళవారం కొత్తగా గ్రామ సంఘాలలో ఎన్నికైన గ్రామ సంఘం పదాధికారులకు ఒక్క రోజు శిక్షణ నిర్వహించినట్లు ఏపీఎం ప్రసన్నకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రసన్న కుమార్ మాట్లాడుతూ.. సంఘాలు బలోపేతం, బ్యాంకు రుణాలు తీసుకోవడం, స్త్రీనిధి, గ్రామ సంఘం రుణాలు తీసుకోవడం తిరిగి చెల్లించడం చేయాలనీ, సంఘంలో లేని సభ్యులను సంఘంలో చేర్పించడం, సమావేశాలను నెలలో 2 సార్లు నిర్వహించాలని సూచించారు. పంచ సూత్రాలు పాటించడం తప్పనిసారిగా చేయాలని పేర్కొన్నారు. సీసీలు శ్రీనివాస్, దుర్గాదాస్ తదితరులున్నారు.

సాక్షి ఎఫెక్ట్..

ఇంకుడు గుంతలో చెత్త తొలగింపు



కామారెడ్డి అర్బన్: కామారెడ్డి హెడ్‌పోస్టాఫీసు ఆవరణలో భూగర్భజలాల వృద్ధి కోసం నిర్మించిన ఇంకుడు గుంత చెత్త కుప్పగా మారిందని 'సాక్షి'లో ఈనెల 16న వచ్చిన వార్తకు మున్సిపల్ సానిటరీ అధికారులు స్పందించారు. మంగళవారం మున్సిపల్ జవాన్ రహమన్ పారిశుధ్య సిబ్బందితో చెత్తను తొలిగింపజేయడంతో పాటు పరిసరాల చెత్తను మున్సిపల్ చెత్తబండి ద్వారా తీసుకుపోయారు.

కూలిన చెట్టును తొలగించారు



బాన్సువాడ రూరల్: కూలిన చెట్టును తొలగించండి అనే శీర్షికన ఈనెల 23న సాక్షి దినపత్రికలో ప్రచురితమైన వార్తకు హన్మాజీపేట్ పంచాయతి కార్యదర్శి రాజేష్ స్పందించారు. అవాజ్‌పల్లి తండా అంగన్‌వాడీ సెంటర్ ఆవరణలో ఇటీవల ఈదురుగాలులకు కూలిన చెట్టుతో పాటు కొమ్మలను తొలగించారు. చిన్నారులు ఆడుకునేలా పరిసరాలను శుభ్రంగా మార్చారు.

మళ్లీ సీసీ రోడ్డు వేయించిన అధికారులు

మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలోని ఇటీవల నూతనంగా వేసిన సీసీ రోడ్డు పనుల్లో నాణ్యత లేక పోవడంతో వానాకాలంలో కురిసిన ఒక్క వర్షానికే రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. ఈ నెల 15న సాక్షి దినపత్రికలో 'కంకర తేలి.. అధ్వానంగా మారి..' అనే వార్తా కథనానికి పంచాయతీరాజ్ శాఖాధికారులు స్పందించారు. మంగళవారం ఏఈ అరుణ్ దగ్గరుండి ఇటీవల వేసిన సీసీ రోడ్డుపైన మళ్లీ నూతన సీసీ రోడ్డు వేయించారు. గ్రామస్తులు సహకరించి సీసీ రోడ్డుకు పూర్తిగా వాటర్ క్యూరింగ్ చేసిన తర్వాతే ఉపయోగించాలన్నారు. తుకారం, సంతోష్ మేస్త్రీ తదితరులున్నారు.



బీమా చెక్కు అందజేత

నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్ నగర్ మండలంలోని తుంకిపల్లి గ్రామానికి చెందిన రౌతు సాయిలు కుటుంబానికి మంగళవారం రూ. 6.5 లక్షల ప్రమాదబీమా చెక్కును అందజేసినట్లు సూపర్ వైజర్ స్వాగత్ తెలిపారు. రౌతు సాయిలు ప్రమాదవశాత్తూ మృతిచెందగా ఓ ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీ ద్వారా రూ. 6.5 లక్షలు మంజూరు అయ్యాయని చెప్పారు.

వీధి దీపాలను అమర్చండి



భిక్కనూరు: మండల కేంద్రంలోని కుమ్మరిగల్లీ ప్రాంతంలో వీధి దీపాలు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, వెంటనే వీధి దీపాలను అమర్చాలని సమాచార హక్కు పరిరక్షణ కమిటీ ప్రతినిధి గంగళ్ల రవీందర్ ఆధ్వర్యంలో గ్రామస్తులు మంగళవారం జీపీ ఈవో మహేష్‌గౌడ్‌కు వినతి పత్రం అందజేశారు. నేతలు సత్యనారాయణ, నారాయణ, రాజుర లింగ, యాదగిరి, దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

వర్షాల కోసం ప్రత్యేక పూజలు



మద్నూర్(జుక్కల్): మండలంలోని అవాల్‌గావ్, మద్నూర్, డోంగ్లీ మండలంలోని మొగా, చిన్న టాక్లీ గ్రామాల్లో మంగళవారం వర్షాలు కురవాలని గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బోనాలతో ఊరేగింపు చేపట్టి అమ్మవారికి ప్రత్యేక నైవేద్యాలు సమర్పించారు. ఆయా గ్రామాల్లో అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

రైతు భరోసా సంబురాలు



తాడ్కోల్ రైతువేదికలో రైతు నేస్తం కార్యక్రమం వీక్షిస్తున్న ఎమ్మెల్యే పోచారం, ఆగ్రోస్ చైర్మన్ కాసుల



బాన్సువాడలో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం



అచ్చంపేట రైతు వేదిక వద్ద..



తాడ్వాయి రైతు వేదికలో..



బీబీపేటలో ..



సదాశివనగర్ మండలం ధర్మారావుపేట్ రైతు వేదికలో..

సాక్షి నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా రైతు వేదికల్లో మంగళవారం నిర్వహించిన రైతు భరోసా విజయోత్సవ సభ ప్రత్యక్ష ప్రసారాన్ని అధికారులు, ప్రజా ప్రతినిధులు, రైతులతో కలిసి వీక్షించారు. తెలంగాణ రైతులకు పంట పెట్టుబడి సాయం కింద ఎకరాకు రూ.6 వేల చొప్పున నిధులు విడుదల చేసిన సందర్భంగా విజయోత్సవాలు నిర్వహిస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వం కేవలం 9 రోజుల్లో 15 ఎకరాల వరకు భూములున్న సుమారు 67 లక్షల మంది రైతులకు రూ.9 వేల కోట్ల నిధులను జమ చేసినట్లు అధికారులు వెల్లడించారు. రైతువేదికలో ప్రతి మంగళవారం నిర్వహించే రైతునేస్తం కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తాడ్కోల్ రైతు వేదికలో ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. పలు చోట్ల సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు, రైతులతో కలిసి పాలాభిషేకం చేశారు.

సంక్షిప్తం

యూరియా కొరత లేదు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): యూరియా కొరత ఉందని రైతులు ఆందోళన చెందవద్దని ఏవో శ్రావణ్ కుమార్ అన్నారు. తాడ్వాయి సింగిల్‌విండో కార్యాలయంలో యూరియా అందుబాటులో ఉందన్నారు. రైతులు పంటలకు సరిపడా ఎరువులనే మాత్రమే వాడాలన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పరిశీలన



నిజాంసాగర్(జుక్కల్): జుక్కల్ మండలం లొంగన్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను మంగళవారం స్థానిక ఎంపీడీవో శ్రీనివాస్ పరిశీలించారు. ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు సకాలంలో నిర్మాణాలను పూర్తి చేయాలన్నారు. విడతల వారీగా బిల్లులను లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని చెప్పారు.

లక్ష్మీనర్సింహస్వామి ఆలయ అభివృద్ధికి విరాళం



మాచారెడ్డి: చుక్కాపూర్ లక్ష్మీనర్సింహస్వామి ఆలయం అభివృద్ధికి హైదరాబాద్‌కు చెందిన రాజేందర్ -విజయ దంపతులు మంగళవారం రూ. 10,116 విరాళంగా అందజేశారు. ఆలయ కమిటీ చైర్మన్ కమాలకర్‌రెడ్డి దాతకుటుంబాన్ని సన్మానించారు. సీనియర్ అసిస్టెంట్ సంతోష్, అర్చకులు నర్సింహాచార్యులు, సంజీవచార్యులు, పరంధామచార్యులు, శ్రీనివాసచార్యులు పాల్గొన్నారు.

అర్హులైన నిరుపేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలి

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని రామేశ్వరపల్లిలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల వెనకాల 20 ఏళ్లుగా గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్న నిరుపేదలకు తక్షణమే ఇళ్ల పట్టాలు ఇవ్వాలని ఎంసీపీఐయూ ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్ జనార్దన్‌కు వినతిపత్రం అందజేశారు. నాయకులు స్వామి, ప్రసాద్, సునీత, స్వరూప, స్వప్న తదితరులున్నారు.

స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించాలి



ఎల్లారెడ్డి: స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు శంకర్ మంగళవారం మంత్రి పొన్న ప్రభాకర్‌ను కోరారు. మంగళవారం ఎల్లారెడ్డిలో మంత్రిని కలిసి ఈ విషయమై వినతిపత్రం అందించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని కోరారు.